# యూరియా వినియోగాన్ని తగ్గించాలి

**వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు చిరంజీవి, వినయ్**
**గుండాల గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'**

చేవెళ్ల రూరల్, మే 27 : రైతులు పండించే పంటల్లో యూరియా వినియోగాన్ని తగ్గించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ చిరంజీవి, డాక్టర్ వినయ్ సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం చేవెళ్ల మండల పరిధి గుండాల గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. పంటల్లో యూరియా వాడకాన్ని తగ్గించాలని, ఇది పురుగులను ఆకర్షిస్తుందని అన్నారు. ఎరువులు, రసాయనాలను పరిమిత పరిమాణంలో ఉపయోగించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించి, మట్టికి ఆరోగ్యం చేకూరుస్తుందన్నారు. అధిక దిగుబడుల కోసం రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని, అన్ని సీజన్లలో ఒకే పంట వేయడం మానుకోవాలన్నారు. పచ్చి ఎరువు పంటల సాగును ప్రోత్సహించాలని, రైతులు పచ్చి ఎరువు పంటల విత్తనాల లభ్యత, ట్రాన్స్ ప్లాంటింగ్ యంత్రాలకు సంబంధించిన సబ్సిడీలపై రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలిచ్చారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన కొత్త రకాల హైబ్రిడ్ విత్తనాలపై వివరించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేస్తే బిల్లులు తీసుకుని భద్రపరుచుకోవాలని, పంట నష్టాలు వాటిల్లినప్పుడు బీమా కోసం ఉపయోగపడుతుందని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ విధానాలను పాటించాలని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పీజీ విద్యార్థులు కిశోర్, తేజ, మండల వ్యవసాయ విస్తరణ అధికారి స్వాతి ప్రియ, కందవాడ పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.


చేవెళ్ల రూరల్ : మాట్లాడుతున్న వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త చిరంజీవి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త పద్మజ

**తక్కువ మోతాదులో ఎరువులు వాడాలి**

మొయినాబాద్ : వ్యవసాయ పంటలకు తక్కువ మోతాదులో రసాయన ఎరువులు వినియోగించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు నీలిమ, రేవతి అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొయినాబాద్ మండల పరిధిలోని చిన్నషాపూర్‌లో రైతులకు పంటల సాగు, పంటల సస్యరక్షణ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ, ఏఈఓ కుమార్, రైతులు పాల్గొన్నారు.

**పంట మార్పిడితో అధిక దిగుబడి**

యాచారం : పంట మార్పిడితో వ్యవసాయ రంగంలో అధిక దిగుబడి సాధించవచ్చు అని వ్యవసాయ శాస్త్రవేత్త పద్మజ అన్నారు. మండలంలోని నానక్‌నగర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో యూరియా ఎరువుల వాడకం వాటి ప్రయోజనాలు, దుష్ప్రభావాలు, పురుగుమందుల వినియోగం, విత్తనాలు, పురుగుమందుల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి ప్రాముఖ్యత, నీటి వినియోగం, తదితర అంశాలపై రైతులకు శాస్త్రీయంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త పద్మజ మాట్లాడుతూ... రైతులు కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి రవినాథ్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు ఉన్నారు.



చేవెళ్ల రూరల్, మే 27 : 1991-92 సంవత్సరంలో శంకర్‌పల్లి మండల పరిధి ప్రొద్దటూరు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం టంగటూరులోని కేఎంఆర్ వ్యవసాయ క్షేత్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

పెద్దఅంబర్‌పేట, మే 27: పెద్దఅంబర్‌పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరం చదివిన పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని కుమార్, జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి సైతం తమవంతుగా తోడ్పాటు అందించాలని నిర్ణయించారు.

## 30న కలెక్టరేట్ ఎదుట ధర్నా


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనూనాయక్, కూలీలు

షాద్‌నగర్‌రూరల్, మే 27: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టరక్షణ, కూలీల వేతనాల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనూనాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉపాధి హామీ కూలీలతో కలిసి ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పేదలకు ఉపాధిహామీ పని కల్పించాలని, రోజూకు రూ. 600ఇవ్వడంతో పాటు కనీస పనిదినాలు 200రోజులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కూలీలు నర్సింహులు, స్వరూప, నర్సమ్మ, యాదమ్మ, రాములమ్మ, స్వాతి, సత్తెమ్మ, రాములమ్మ, జ్యోతి, బాలమణి, పుష్పమ్మ, రామలింగం, ఇందిరమ్మ, యాదయ్య, జంగయ్య, లక్ష్మమ్మ, భారతమ్మ, లక్ష్మమ్మ, యాదమ్మ, పద్మమ్మ, జంగమ్మ, చంద్రయ్య, జంగయ్య, అంజయ్య, యాదయ్య, కృష్ణ పాల్గొన్నారు.

### ఇబ్రహీంపట్నం తహసీల్దారుగా
## వరప్రసాద్ బాధ్యతల స్వీకరణ

ఇబ్రహీంపట్నం, మే 27: ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా వరప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ప్రసాద్ నిజామాబాద్ జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో కరీంనగర్ నుంచి బదిలీపై వరప్రసాద్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు.

## మహాధర్నా కరపత్రం విడుదల

యాచారం, మే27: ఉపాధి హామీ చట్టాలను కాపాడేందుకు ఈ నెల 30న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని తక్కలపల్లి, కొత్తపల్లి, తాటిపర్తి గ్రామాల్లో మహాధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కూలీలు పాల్గొన్నారు.


మహాధర్నా కరపత్రాన్ని విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు అంజయ్య


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శైలజ

### ఉపాధి పనులను
## పక్కాగా చేపట్టాలి

యాచారం, మే27: ఉపాధి హామీ పనులను మండలంలోని అన్ని గ్రామాల్లో పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో శైలజ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇండ్లపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాలలో పనులను వేగవంతం చేయాలని ఆమె కోరారు. ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, ఇందిరమ్మ ఇండ్ల పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీవో శ్రీలత పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా శక్తి కుట్టు కేంద్రం పరిశీలన



కేశంపేట, మే 27 : మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని మంగళవారం ఏపీడీ (అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్) సూర్యారావు పరిశీలించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల యూనిఫాంలను మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని పరిశీలించినట్లు ఏపీఎం భగవంతు తెలిపారు. పాఠశాలలు ప్రారంభం అయ్యేలోపు యూనిఫాంలను కుట్టడం పూర్తిచేసి విద్యార్థులకు అందించేందుకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం బాల్‌రాజ్, భూతల్లి మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్‌పర్సన్ విజయ, సీసీలు మల్లేశ్, రాంచంద్రయ్య, నర్సింహ, తిరుపతమ్మ, జి.నర్సింహ, కవిత, మాధవి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

చేవెళ్ల టౌన్, మే 27: కాంగ్రెస్ ప్రభుత్వం రౌడీపాలన కొనసాగిస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిరిసిల్లలో మాజీ మంత్రి కేటీఆర్ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడానికి ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. వారి చర్యను ఖండిస్తున్నామన్నారు. ప్రజాపాలన అని చెప్పుకొని గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రౌడీ పాలన చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని నిరంతరం నిలదీస్తామని అన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



చేవెళ్ల రూరల్, మే 27 : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని హరితసేన శంకర్‌పల్లి మండల ఇన్‌చార్జి మల్లేశ్ అన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ గ్రీన్ ఇండియా (ఛాలెంజ్) హరితసేనలో భాగంగా శంకర్‌పల్లి మండల హరిత సేన ఇన్‌చార్జిగా శంకర్‌పల్లి మండలం మహాలింగాపూర్ గ్రామానికి చెందిన మల్లేష్‌ను నియమించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన శంకర్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్, స్థానిక నేతలు జహంగీర్ ఖాన్, మహేందర్‌రెడ్డి, సంజయ్, ఇంద్రసేనారెడ్డి, వెంకటరాంరెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

## పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం



పెద్దఅంబర్‌పేట, మే 27: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరిట పూటకో ఎన్‌కౌంటర్ చేసి అమానుషంగా చంపుతున్నారని సీపీఐ రాష్ట్ర నాయకుడు ఆందోజు రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు రాజీవ్ గృహకల్పశాఖ మహాసభ రాములు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినవారి భౌతిక కాయాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేయకుండా పోలీసులే దహన సంస్కారాలు నిర్వహించడం ఏ మానవత్వానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని, చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. నిరంతర పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు హరిసింగ్‌నాయక్, యాదయ్య, గణేశ్, రాము, వెంకట్, నరసింహ, శ్రీను, హుస్సేన్ పాల్గొన్నారు.

## నిందితుడికి రిమాండ్

కేశంపేట, మే 27 : వాహనాలకు చెందిన బ్యాటరీ చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కేశంపేట సీఐ నరహరి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు మండలం రంగనాయకపురం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు(23) హైదరాబాద్‌లోని నల్లకుంటలో నివాసం ఉంటూ డ్రైవర్ వృత్తి చేస్తున్నాడన్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో మండల పరిధిలోని లేమామిడి, భైరఖాన్‌పల్లి గ్రామాల్లోని వాహనాలకు చెందిన బ్యాటరీలను అపహరించుకెళ్లాడన్నారు. నాగేశ్వరరావు 12బ్యాటరీ చోరీలకు పాల్పడితే అందులో 4కేసులు కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోనే నమోదయ్యాయని, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

నందిగామ, మే27: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నందిగామ సమీపంలో మంగళవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్టానికి చెందిన రమేశ్ కొత్తూరు సమీపంలోని ఈట పరిశ్రమలో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం హెచ్ బీఎల్ పరిశ్రమ సమీపంలో రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు.

# సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ

షాబాద్, మే 27: రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు షాబాద్ మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాబాద్ సహకార సంఘం కార్యాలయంలో ఈ వానకాలం సీజన్‌కు సంబంధించి 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట(జీలుగ)విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలానికి 75 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చినట్లు తెలిపారు. 30 కిలోల బస్తా మొత్తం ధర రూ.4275 ఉండగా, 50 శాతం ప్రభుత్వ సబ్సిడీ పోగా, రైతు రూ. 2137 చెల్లించాలన్నారు. మండలంలో జీలుగ విత్తనాలు అవసరం ఉన్న రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని వచ్చి విత్తనాలు తీసుకోవాలని కోరారు. 28వ తేదీ నుంచి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

**షాద్‌నగర్‌టౌన్ :** వర్షకాల పంటల సాగుకు సంబంధించి రైతులకు పచ్చిరొట్ట ఎరువులను సబ్సిడీపై ఇవ్వనున్నట్లు షాద్‌నగర్ వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీఏ నిశాంత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటాల్ రూ. 14250ఉండగా 50శాతం సబ్సిడీతో రూ. 7125లకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా 30కేజీల పచ్చిరొట్ట ఎరువులకు గాను రూ. 2137.50, 40కేజీల జనుములకు రూ. 2510లను చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు పట్టాపాస్‌బుక్‌తో పట్టణంలోని కేశంపేట్‌రోడ్డులోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం-2లో సంప్రదించి పచ్చిరొట్ట ఎరువులను సబ్సిడీపై తీసుకోవాలన్నారు.

**కేశంపేట :** కేశంపేట మండలానికి చెందిన రైతులకు సబ్సిడీపై పచ్చి రొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారిణి శిరీష మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో 19.8 క్వింటాళ్ల జనుములు, 200బస్తాల జీలుగ 50శాతం సబ్సిడీపై ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రాజ్‌కుమార్

కేశంపేట, మే 27 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కేశంపేట ఎస్ఐ రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేసి వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపట్ల అవగాహన కల్పించారు. లైసెన్స్ లేని వ్యక్తులు వాహనాలు నడిపితే నేరమని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. మద్యం మత్తులో ఎవరుకూడా వాహనాలను నడపవద్దని, ఏదైనా ప్రమాదానికి కారణమైతే జీవిత ఖైదు పడుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రెప్పపాటులో జరిగే ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### కుంట్లూరు పెద్ద
## చెరువులో నిర్మాణ వ్యర్థాలు

**పోలీసులకు హైడ్రా అధికారుల ఫిర్యాదు**

పెద్దఅంబర్‌పేట, మే 27: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు పెద్ద చెరువు బఫర్‌జోన్‌లో నిర్మాణ వ్యర్థాలు వేయడంపై హయత్‌నగర్ పోలీసులకు హైడ్రా అధికారులు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం టిప్పర్‌లో నిర్మాణ వ్యర్థాలను తీసుకొచ్చి కుంట్లూరు పెద్ద చెరువు బఫర్ జోన్‌లో వేశారు. హైడ్రా వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్, ఇతర సిబ్బంది చరణ్‌తేజ, సతీశ్ గమనించారు. ఈ విషయమై టిప్పర్ డ్రైవర్ రామకృష్ణతోపాటు వాహన యజమాని రవీందర్‌రెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలని హైడ్రా అధికారులు ఫిర్యాదు చేశారు.

## పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలి


పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సింగంపల్లి గ్రామస్తులు

ఆమనగల్లు, మే 27: ఆమనగల్లు మండల పరిధిలోని సింగంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలని కోరుతూ గ్రామస్తులు జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. బుధవారం సింగంపల్లి గ్రామస్తులు జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతను కలిసి కార్యదర్శిని బదిలీ చేయాలని వినతిపత్రం అందజేశారు. గ్రామ కార్యదర్శి జంగయ్య తన విధులు సక్రమంగా నిర్వహించడం లేదని గ్రామంలో నెలకొన్న తాగునీరు, వీధిదీపాలు, పారిశుధ్య నిర్వహణ పట్టించుకోవడం లేదని, సమస్యలు పరిష్కరించాలని కోరితే వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని వారు వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహ, శ్రీను ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కేశంపేట, మే 27 : రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతి చెందిన ఘటనలో మంగళవారం కేశంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన సంతోష్‌కుమార్ సాకేత్ (35) కేశంపేట శివారులోని ఓ మామిడి తోటలో కూలీ పనులకు కుదిరారు. అదే తోటలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సందీప్ అతడి భార్య సైతం పని చేస్తున్నారన్నారు. సందీప్ బంధువులు ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో ఉండడంతో వారిని కలిసేందుకు ఈ నెల 26న రాత్రి సమయంలో తన వాహనంపై సంతోష్‌కుమార్ సాకేత్, సందీప్ వెళ్లారని, సందీప్ తన బంధువుల వద్దనే ఉండడంతో సంతోశ్‌కుమార్ సాకేత్ ఒక్కడే తిరుగు ప్రయాణమయ్యాడన్నారు. తులవానిగడ్డ సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి కింద పడడంతో తలకు ఇతర భాగాల్లో బలమైన గాయాలయ్యాయని, చికిత్స కోసం 108 సహాయంతో షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి మెరుగైన వైద్యం కోసం ఓజీహెచ్ హైదరాబాద్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారని పేర్కొన్నారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారని, మృతుడి భార్య కుష్బూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

## మెడికల్ కిట్ల పంపిణీ

కడ్తాల్, మే 27: తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. జిల్లా మాజీ జడ్పీ కోఆప్షన్ మాజీ మెంబర్ రహమాన్, నాయకులు నరేందర్‌గౌడ్, మోహన్‌లాల్, శ్రీకాంత్‌యాదవ్, శ్రీరామ్, రాము, వైద్య సిబ్బంది సువర్ణ, సుజాత, సంధ్య, ఆశ వర్కర్లు మాధవి, సరస్వతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

### రాజకీయ కక్షతోనే
## కేటీఆర్‌పై కేసులు

ఇబ్రహీంపట్నం, మే 27 : రాజకీయ కక్షతోనే ప్రభుత్వం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ భరత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆయన విమర్శించారు. రేవంత్‌రెడ్డి కక్షపూరిత రాజకీయాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ఆర్థిక సాయం అందజేత

ఇబ్రహీంపట్నం, మే 27 : మున్సిపాలిటీకి చెందిన మంకాల రాజు మృతి చెందాడు. బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కోని రాజు మంగళవారం బాధిత కుటుంబానికి రూ.50,000 ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట కుమార్, గణేశ్, అశోక్, ప్రవీణ్, శ్రీకాంత్, భాను, సాయి, కిశోర్, శ్రీను ఉన్నారు.

### రెండు బైక్‌లు ఢీ...
## ఒకరి పరిస్థితి విషమం

కందుకూరు, మే 27: రెండు బైకులు ఢీకొని ఇరువురికి గాయాలు కాగా అందులో ఒక వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి... రంగారెడ్డి జిల్లా కడ్తాల్ గ్రామానికి చెందిన కడారి శివరాజు మండల పరిధిలోని కొత్తూరు గ్రామానికి బైక్ పై తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా, కొత్తూరు వద్ద హైదరాబాద్, శ్రీశైలం రహదారిపైకి వస్తుండగా అదే సమయంలో నాగర్ కర్నూల్ జిల్లా( కల్వకుర్తి ) కొండరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుజ్జుల శివ తన బంధువులు ఆస్పత్రిలో ఉండగా ఇంటికి వెళ్లి డబ్బులు తీసుకురావడానికి బైక్ పై శ్రీశైలం, హైదరాబాద్ రహదారిపై వస్తుండగా అదే సమయంలో రెండు బైకులు ఢీకొన్నాయి దీంతో ఇరువురికి గాయాలు అయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## దాతల సహకారం అభినందనీయం



చేవెళ్ల రూరల్, మే 27 : సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతల సహకారం అభినందనీయమని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. మంగళవారం మండల పరిధి పామెన గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి సీసీ కెమెరాల ఏర్పాటులో తన వంతు సహకారంగా రూ.లక్షా 50 వేల నగదును సీఐ భూపాల్ శ్రీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని, ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. దాత గోపాల్‌రెడ్డిని ఆయన అభినందించారు.

### పార్టీ అభివృద్ధి కోసం
## సైనికుల్లా పని చేయాలి

చేవెళ్ల టౌన్ : మే 26: పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి అన్నారు. మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్రస్థాయి జనసేన దళ్ శిక్షణ శిబిరం రెండవ రోజు కొనసాగింది. అనంతరం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ పార్టీ బలోపేతం కోసం జనసేన కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆలూరు పీహెచ్‌సీ వేద, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పార్టీ చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి, పార్టీ మొయినాబాద్ మండల కార్యదర్శి శ్రీనివాస్, పార్టీ షాబాద్ మండల కార్యదర్శి జంగయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, కృష్ణ పాల్గొన్నారు.

